క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీరాల అర్బన్: పట్టణంలోని దండుబాటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని ఏఈఈ హరిప్రసాద్ గురువారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విఠల్‌నగర్, వైకుంఠపురం, స్వర్ణ రోడ్, లైబ్రరీరోడ్, దండుబాట ఏరియా, హరిప్రసాద్‌నగర్, ఉజిలిపేట, జయంతిపేట, ఐక్యనగర్, మరియమ్మపేట, కొత్తపాలెంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

వర్ష బీభత్సం

యద్దనపూడి: మండల కేంద్రం గురువారం సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో కారు మబ్బులు కమ్ముకుని పిడుగులతో కూడిన వర్షం బీభత్సం చేసింది. దీంతో మండల వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పిడుగుల ధాటికి జనం తీవ్ర భయాందోళనలు చెందారు. పోలూరు వాగు, యద్దనపూడి వాగు, గన్నవరం- మార్టూరు మధ్య ఉన్న వాగులు పొంగిపొర్లాయి. విద్యుత్ ప్రసారం నిలిచిపోవడంతో ఫోన్లు కూడా మూగబోయాయి. పలు కంపెనీల డేటా నెట్‌వర్క్‌లు నిలిచిపోయాయి. రోడ్లకు అడ్డంగా వృక్షాలు నేలకొరగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పల్లపు కాలనీల్లోని ఇళ్లలోకి నీరు చేరాయి.

బధిరుల పాఠశాలకు యూనిఫాం అందజేత



బధిరులకు యూనిఫాం అందజేస్తున్న దాతలు

పర్చూరు(చినగంజాం): మండలంలోని నాగులపాలెం బధిరుల ఉన్నత పాఠశాలలో దాతలు గురువారం 40 మంది బధిర విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫాం అందజేసినట్లు హెచ్‌ఎం సీహెచ్ ఉమాదేవి తెలిపారు. విదేశాల్లో స్థిరపడిన మండలంలోని వీరన్నపాలెం గ్రామానికి చెందిన కోడే ఉమాదేవి, నాగుబడి రంగయ్య, అచ్చమ్మలు బధిరుల విద్యార్థిని, విద్యార్థులకు ఒక్కొక్కరికి 2 జతల చొప్పున యూనిఫాం బహూకరించారు. దాతలకు పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేశారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం భాద్రపద మాసం ఆశ్లేష నక్షత్రం త్రయోదశి శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

పొగాకు సాగుకు సమాయత్తం

- అధికారులు వద్దంటున్నా..
- ఆశల పల్లకీలో రైతులు

బల్లికురవ: గత ఏడాది సాగుచేసిన బర్లీ పొగాకుకు ధర రాకపోగా.. ఉత్పత్తులు రైతుల ఇళ్ల నుంచి కదలక పోయినా ఆశతో తిరిగి ఈ ఏడాది సాగుకు సమాయత్తం అవుతున్నారు. మండలంలోని వల్లాపల్లి కె. రాజుపాలెం, కొణిదెన, వేమవరం, సోమవరప్పాడు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు భూములు పదునెక్కటంతో ఇతర ప్రాంతాల నుంచి అధిక రేటుకు నారు కొనుగోలు చేస్తున్నారు. కలెక్టర్, వ్యవసాయాధికారులు పొగాకు సాగు చేయవద్దని ప్రకటనలు ఇస్తున్నా.. రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన లేక పంటపై ఉన్న మమకారంతో సాగుకు సమాయత్తం అవుతున్నారు. గ్రామాల వారీగా పొగాకు సాగుచేసే రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించకపోతే సాగు విస్తీర్ణం పెరగటంతో పాటు అమ్ముకునే పరిస్థితులు కూడా ఉండవని పలువురు ఆందోళన చెందుతున్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

చీరాల రూరల్: మహిళలు ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే సమాజం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని చీరాల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల పర్యవేక్షకుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమం శుక్రవారం నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళల్లోని దీర్ఘకాలిక వ్యాధుల పరిశీలన కోసం స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు చెప్పారు. నర్సింగ్ సూపర్‌వైజర్ జ్యోతి, టీబీ ఆరోగ్య కార్యకర్త కె. శ్రీలక్ష్మి, టీయూ నరేంద్రబాబు, ఎల్‌టీ వర్ధధార, హరికాంత్, రియాజ్, టీబీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆకలి కేకలు

- ఆరు నెలలుగా జీతాల్లేక అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు (ఫైల్)

చీరాల టౌన్: కూటమి పాలనలో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా ఉన్న పారిశుద్ధ్య కార్మికుల వెతలు తీర్చేవారు కానరావడంలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఠంచనుగా నెలనెలా జీతాలు అందుకోగా.. నేడు నెలల తరబడి జీతాల రాక....అప్పులు పుట్టక అల్లాడుతున్నారు. చాలీచాలనీ వేతనాలతో కడుపు నింపుకోలేక.. అధిక ధరలు భరించలేక.. మురుగు వల్ల దాపురిస్తున్న అనారోగ్య సమస్యలు నయం చేసుకొనేందుకు డాక్టర్ వద్దకు పోయేందుకు పైసలు లేక.. దారుణంగా బతుకులీడుస్తున్నారు. వారికి నెలనెలా కేటాయించాల్సిన సబ్బులు, చెప్పులు, నూనెలు కూడా ఇవ్వడంలేదు. చీరాల మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 65 మంది, వేటపాలెం మండలంలోని 9 గ్రామ పంచాయతీల్లో 60 మంది మొత్తం 135 మంది కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నారు. చాలా మందికి ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. చెత్తచెదారం తొలగింపులతో పాటు, స్వీపర్లుగా, వాచ్‌మెన్లుగా కూడా పనులు నిర్వహిస్తున్నారు. పంచాయతీల్లో పనిచేసే వారికి రోజుకు రూ. 370 నుంచి రూ.400 వరకు మాత్రమే కూలీగా అందిస్తున్నారు.

వేతనాలు ఇవ్వకుంటే ఆందోళన

పారిశుద్ధ్య కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం దారుణం. వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం హేయం. ప్రభుత్వం, మండల, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వేతనాలు ఇవ్వాలి. లేకుంటే ఆందోళనలు చేస్తాం. ఒక్కో కార్మికుడికి కనీస వేతనం రోజుకు రూ.394 ఇవ్వాల్సిందే. పంచాయతీ ఆదాయాన్ని బట్టి తక్కువ వేతనం అందించడం దారుణం.

– ఎం.వసంతరావు, సీఐటీయూ మండల కార్యదర్శి, చీరాల

నిధులు లేకనే జీతాల చెల్లింపుల్లో జాప్యం

కార్మికులకు వేతనాలు ఇచ్చేది కాంట్రాక్టర్లు. పంచాయతీకి ఇస్తున్న ఆదాయం నుంచి వీరికి వేతనాలు ఇస్తారు. పంచాయతీలకు కొంత ఆదాయం లేకపోవడంతో కార్మికులకు జీతాల చెల్లింపుల్లో జాప్యం ఏర్పడింది. 15 ఫైనాన్స్ నిధుల లేకపోవడం, అన్నింటికీ సాధారణ నిధులను వాడటం వలనే జీతాలు సక్రమంగా అందించడం లేదు. పది రోజుల్లోపు పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇచ్చేలా కృషి చేస్తా.

– రామకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ, చీరాల

రికవరీలు వేగవంతం చేయాలి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకునేలా కృషి చేయాలని ఏపీఎం కె.మధుసూదనరావు సూచించారు. బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో గురువారం వీవోఏలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడారు. ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రుణాలను అందిస్తుందని, పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధి పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. సామాజిక పెట్టుబడి నిధి రికవరీలు త్వరగా చేయాలన్నారు. పొదుపు గ్రూపుల ఆడిట్‌లు క్రమం తప్పకుండా చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా మండలంలో అందించిన రుణాల రికవరీలు చేయాలన్నారు సీసీ, సీపీలు, పొదుపు సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల పరిశీలన



గవినివారిపాలెం: పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు రమణా రెడ్డి

చీరాల రూరల్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి పలువురు రైతులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చీరాల మండలంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల సౌకర్యార్థం రైతులకు ఉపయోగపడే విధంగా చీరాల మండలంలో 22 రైతు భరోసా కేంద్రాలను నిర్మించిందని చెప్పారు. అయితే వాటిలో (కావూరివారిపాలెం, తోటవారిపాలెం, బోయినవారిపాలెం, చీరాల నగర్) గ్రామాల్లో 4 కేంద్రాల్లో మాత్రమే అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారని మిగతా కేంద్రాలను రైతులు వినియోగించకుండా తాళాలు వేశారని చెప్పారు. దీనివలన రైతులు ఎంతో నిరాశకు గురవుతున్నారని.. రైతులకు వ్యవసాయంలో మెళకువలు నేర్పేవారులేక, రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేవారులేకపోతే దిగుబడులు తగ్గిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తాళాలు వేసి మూసివేసిన రైతు భరోసా కేంద్రాలను తక్షణమే తెరిపించి రైతులకు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

హక్కుల కోసం ఐక్య పోరాటం



మాట్లాడుతున్న వసంతరావు

వేటపాలెం: హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. వసంతరావు అన్నారు. రామన్నపేట పంచాయతీ రావూరిపేటలో గల ఆక్వా అసోసియేషన్ భవనంలో సీఐటీయూ నాలుగో మహాసభ గురువారం నిర్వహించారు. ఎనిమిది గంటల పనిదినాన్ని సాధించడానికి కార్మికులు చేసిన చారిత్రాత్మక పోరాటాలను గుర్తు చేశారు. కానీ నేటి పాలనలో మళ్లీ అదే హక్కును కొట్టేసి, పది గంటల పనిదినం అమలు చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. సంక్షేమ పథకాల కోతలు, ప్రభుత్వం రంగ సంస్థల ప్రైవేటీకరణ చర్యలు.. కార్మిక వర్గాన్ని బలహీనపరుస్తున్నాయని పేర్కొన్నారు. కార్మికుల జీవన భద్రత కూడా ప్రమాదంలో పడుతోందని.. కూలీ నుంచి కర్షకుడి వరకు ఎదుర్కొంటున్న సమస్యల వెనుక ప్రైవేటీకరణే మూలకారణమన్నారు. సీఐటీయూ చీరాల మాజీ కార్యదర్శి బాబూరావు మాట్లాడుతూ కొత్తకోడ్స్ ప్రకారం యూనియన్ల ఏర్పాటు కఠినతరం అవుతున్నాయన్నారు. అనంతరం మండల కన్వీనర్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. నూతన కమిటీ కన్వీనర్‌గా మచ్చ అయ్యప్ప రెడ్డి, కో కన్వీనర్లుగా తన్నీరు శ్రీనివాసరావు, ఇండ్ల బ్రహ్మయ్య, కర్రీ ఆంజనేయులుతో పాటు మరో 15 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ పంచాయతీ మిడ్‌డే మీల్స్, ఆశ రంగాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

ముమ్మరంగా మిర్చి సాగు



బూదవాడలో మిరప తోటలో కూలీలు



మిరప సాలు దున్నుతున్న రైతు

జె.పంగులూరు: గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పంట భూములు పదునెక్కాయి. పంటలు వేయటానికి సరిపడ తేమ భూమిలో ఉంది. ప్రస్తుతం కురుసిన వర్షాలు పత్తి పంటకు కూడా అనుకూలంగా మారడంతో.. మిర్చి నారు మళ్ళు సాగులోకి తెచ్చారు. దీంతో గత వారం రోజుల నుంచి మిర్చి పంట వేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. ఈ పాటికే కొందు రైతులు మిరప మొక్కలు నాటుతుండగా, కొందరు రైతులు మిర్చి సాగుకు పొలం సిద్ధం చేస్తున్నారు. పోయిన సంవత్సరం మండలంలో పత్తి పంట 1639 ఎకరాల్లో సాగు చేశారు. ఈ సంవత్సరం పంట విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పెన్‌డౌన్ కార్యక్రమానికి సహకరించండి

ఇంకొల్లు (చినగంజాం): రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖరులు 19, 20 తేదీల్లో చేపట్టనున్న పెన్ డౌన్ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని మండల దస్తావేజుల లేఖరుల సంఘం నాయకులు తానికొండ ఎలియాజర్ ఒక ప్రకటనలో కోరారు. రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాల వలన దస్తావేజుల తయారీ జటిలమవుతూ తీవ్ర జాప్యానికి గురవుతోందన్నారు. అటు ప్రజలు, ఇటు దస్తావేజు లేఖరులు విలువైన సమయాన్ని వృథా చేసుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. ఈ విధానంలో మార్పును కోరుతూ ప్రభుత్వానికి నివేదించనున్న దృష్ట్యా రెండు రోజుల పాటు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న దస్తావేజులు.. రిజిస్ట్రేషన్‌లకు సంబంధించి ఎటువంటి సేవలు అందించనున్న దృష్ట్యా ప్రజలు సహకరించాలని కోరారు.

గాలికుంటు వ్యాధి టీకాలతో మేలు

బల్లికురవ: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి పి. మహేశ్వరరావు గురువారం తెలిపారు. 12 వేలకు పైగా పాడి గేదెలు, దూడలు, ఆవులు, ఎద్దులకు టీకాలు నెలరోజుల పాటు ఉచితంగా వేస్తారని తెలిపారు.

ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం



అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి హనుమంతు నాయక్

మార్టూరు: పంటల మార్పిడితో రైతులకు భూమికి మేలు కలుగుతుందని.. వాణిజ్య పంట అయిన ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు రావాలని ఉద్యానవన శాఖ అధికారి బి. హనుమంతు నాయక్ కోరారు. ద్రోణాదులలో గురువారం మాట్లాడారు. ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తుందని తెలిపారు. వ్యవసాయ శాఖ సిబ్బంది స్థానిక రైతులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ వెంటనే అమలు చేయండి



కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న కార్మికులు

అద్దంకి: మునిసిపల్ కార్మికులకు మేలు చేసే 12వ పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద గురువారం కార్మికులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మునిసిపల్ కమిషనర్ రవీంద్రకు అందజేశారు. తంగిరాల మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రభుత్వం మానుకోవాలన్నారు. వెంటనే వారి డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు తిరుపతిరెడ్డి, యనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి. ఆదాం, ఉసురుపాటి శామ్యూల్, కోశాధికారి జ్యోతి వెంకటరావు, కమిటీ సభ్యులు జాన్, దాసరి వీరయ్య, ప్రసన్న, ఎం. కోటేశ్వరరావు, జ్యోతి రాఘవయ్య, కృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డల ఆరోగ్యం



దగ్గుబాడులో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హరిత



బల్లికురవలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

కారంచేడు: తల్లీ, బిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన పౌష్టికాహారం అవసరమని కారంచేడు, దగ్గుబాడు పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ గోరంట్ల సురేష్‌బాబు, డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ హరిత అన్నారు. గురువారం మండల కేంద్రమైన కారంచేడు పీహెచ్‌సీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హిమబిందు అధ్యక్షతన పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌ఎన్ ఖాజాబీ, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని దగ్గుబాడులో అంగన్‌వాడీ కేంద్రం -1లో సూపర్‌వైజర్ సునీత ఆధ్వర్యంలో తల్లులకు, గర్భిణులకు తల్లిపాలు, బిడ్డలకు అందించే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిత మాట్లాడుతూ గర్భిణులుగా ఉన్న స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవడం వలన పుట్టబోయే బిడ్డలు మంచి ఆరోగ్యంగా పుడతారాన్నరు. కార్యక్రమంలో హెచ్‌వీ శారమ్మ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

బల్లికురవ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మీరాబి కోరారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం వెలుగు కార్యాలయంలో పొదుపు గ్రూపు మహిళలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వంటల్లో నూనె తక్కువగా వాడాలని, చక్కెర తగ్గించాలని, ఆకుకూరలను ప్రతి రోజూ తీసుకోవాలని వివరించారు. సఖీ కేంద్రంలో అభించే సేవలు, తాత్కాలిక వసతి న్యాయపరమైన సలహాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ విజయనిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన అవసరం



ప్రభుత్వ ఆరోగ్య పథకాలు గురించి వివరిస్తున్న వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది

ఇంకొల్లు(చినగంజాం): ప్రభుత్వం అందించే ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ టి. అంజలి, జి. భాను ప్రకాష్‌లు సూచించారు. ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఇడుపులపాడు 1 ఆరోగ్య ఉపకేంద్రంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ మాత శిశు సంరక్షణ సేవలు, వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చే కార్యక్రమం, సమీకృత ఆహారాన్ని తీసుకోవటం గురించి చైతన్య పరచటం, కిశోర్ బాలికలకు బహిష్టు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ సులోచన, ఆసుపత్రి సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, చూలింతలు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా



ఏపీ మోడల్ స్కూల్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

చీరాల అర్బన్: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లోని హాస్టల్ నిర్వహణ, విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులపై గురువారం జిల్లా వైద్యాధికారి వి.విజయమ్మ పరిశీలించారు. ఏపీ మోడల్ స్కూల్‌లోని విద్యార్థినుల హాస్టల్ నిర్వహణ, విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా ఆమెతో పాటు మెడికల్ ఆఫీసర్ శ్రీదేవి సందర్శించారు. విద్యార్థులకు అందించే మెనూ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు పరిశీలించి దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. వర్షాల కారణంగా నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ జె.సరళ, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు



ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

చీరాల టౌన్: ఇళ్లల్లో నుంచి వచ్చిన చెత్తను రోడ్లపై వేసేవారిపై చర్యలు తీసుకుంటామని గ్రామాల ప్రజలు చెత్తను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల అందించాలని రామకృష్ణాపురం కార్యదర్శి శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం మురుగునీటి కుంటలను పూడ్చివేసి ఖాళీ కొబ్బరి బోండాల నిల్వలను తీసివేయించారు. చెత్తకుప్పలను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయండి

అద్దంకి రూరల్: ఈనెల 21న అద్దంకిలోని సీఐటీయూ కార్యాలయం సుందరయ్య భవన్‌లో జరగనున్న సీఐటీయూ మండల మహాసభను విజయవంతం చేయాలని పి. తిరుపతిరెడ్డి, తంగిరాల వెంకటేశ్వర్లు గురువారం ఒకప్రకటనలో కోరారు. ఈ మహాసభల్లో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన పథకం ఆర్పీలు, మున్సిపల్ వర్కర్స్, ఫ్రూట్స్ వెండర్స్, ఆటో వర్కర్స్ యూనియన్, భవన నిర్మాణ కార్మిక వర్గాలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

శతక పద్య విజేతలకు బహుమతులు



బహుమతులతో గెలుపొందిన విద్యార్థులు

జె.పంగులూరు: మండల పరిధిలోని కొటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం శతక పద్య పోటీలు జరిగాయి. ఈ పోటీలు 4,5 తరగతులకు, 6,7 తరగతులకు వేమన శతకంపై పద్య పోటీ నిర్వహించారు. 8, 9 తరగతులకు సుమతీ శతకంపై జరిగాయి. 4,5 తరగతులకు గాను పంగులూరు పాఠశాలకు చెందిన రితిష్ మొదటి స్థానం, కోటపాడు పాఠశాలకు చెందిన అంజలి రెండో స్థానం, మల్లవరం పాఠశాల విద్యార్థి సాత్విక మూడో స్థానం సాధించారు. 6,7 తరగతులకు గాను కోటపాడు పాఠశాల విద్యార్థిని నిఖిత మొదటి స్థానం, పంగులూరు పాఠశాలకు చెందిన విద్యార్థి రెండో స్థానం సాధించారు. 8,9 తరగతులకు గాను రేణింగవరం పాఠశాల విద్యార్థిని నిఖిత మొదటి స్థానం, పంగులూరు పాఠశాల విద్యార్థి కీర్తన రెండో స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వీరాంజనేయులు, హెచ్‌ఎం వేణు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటస్వామి

పర్చూరు(చినగంజాం): ప్రభుత్వం చేపడుతున్న సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటస్వామి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గురువారం అడుసుమల్లి, గొల్లపూడి గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. గొల్లపూడిలో నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సందర్శించారు. డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com